అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 04 జులై 2023

తానాకుర్తిలో కరెంట్ కష్టాలు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని తనకుర్తి గ్రామంలో గల రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు నిరంతరాయంగా 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నట్టు ప్రచారంలో ఉండగా.. క్షేత్రస్థాయిలో కనీసం 12 గంటలు సైతం కరెంట్ వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాలు లేక రైతులు ఇబ్బందికరంగా ఉంటే కరెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉన్న కరెంటును కాస్త సరైన సమయంలో ఇవ్వక రైతులకు ఇబ్బంది పెడుతున్నారు. గ్రామం పక్కనుంచి 11 కెవి విద్యుత్ తీగల వెళుతున్నాయి. గ్రామంలో ప్రతి చోట చెట్టుకొమ్మలు అడ్డొచ్చి ప్రతిసారి షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల కరెంటు నిలిచివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా చెట్టు కొమ్మలను తొలగించాలని అధికారులను రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ బాబా శ్రీనివాస్, ఏడి బాలేష్‌ను నవతెలంగాణ సంప్రదించగా.. మూడు రోజుల్లో చెట్ల కొమ్మలను తొలగించి కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేస్తామని తెలిపారు.

విద్యా కార్పొరేటీకరణను తరిమికొడదాం

- ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం
- ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో విద్యా కార్పొరేటికరణ ను తరిమికొడతామని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టీ నాగరాజు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం ముగిసాయి.

వివరాలు మెయిన్‌లో..

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం
పోరాటం ఉధృతం


గేటు దూకుతున్న సీఐటీయూ నాయకులు మల్యాలగోవర్ధన్..


గేటు తోసుకొని వచ్చిన వారికి బారికేడ్‌లతో అడ్డగింత

- కలెక్టరేట్ ముందు మూడు గంటల ధర్నా
- భారీకేడ్లు, గేట్లు తోచుకుని కలెక్టరేట్‌లోకి
- నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్ ఆవరణ
- ఆందోళనకారుల వద్దకు ఏఓ ప్రశాంత్
- కలెక్టర్ రావాలంటూ భీష్మించిన నాయకులు, ప్రజలు
- పట్టాల కోసం త్వరలో సర్వేకు కలెక్టర్ హామీ


కలెక్టరేట్ ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, పేదలు

నవతెలంగాణ-నిజామాబాద్‌ప్రాంతీయ ప్రతినిధి

ఇండ్లు, ఇండ్ల స్థలాల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తాత్సారంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. నెల రోజులుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నా సర్కారులో చలనం లేకపోవడంతో పేదల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. ప్రజా సంఘాల చేపట్టిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తంగా సాగింది. ఇనుప గేట్లు, బారికేడ్లు, పోలీసుల బలగం ప్రజా పోరాటం ముందు నిలవదని రుజువయ్యింది. మొదటిసారి కలెక్టరేట్ ప్రధాన గేటు దాటి ప్రజాందోళన కలెక్టర్ ఛాంబర్ సమీపానికి చేరింది. ఏ పోరాటం చేసినా గేటు బయటే నిలుపుదల చేసే ఆనవాయితీకి కళ్లెం పడినట్టయ్యింది. వందలాది మంది ప్రజలు ఒక్కసారిగా కలెక్టరేట్‌కు చొచ్చుకెళ్లడంలో తాళం కప్ప సైతం తుత్తునియలయ్యింది.

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా సాగింది. మొదట నూతన కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద మూడు గంటల పాటు ధర్నా చేపట్టారు. ఆ తరువాత ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ఆందోళన కారులను పోలీసులు నిలువరించారు. ప్రధాన గేటుకు తాళం వేశారు. కానీ ప్రజా పోరాటాల ముందు పోలీసుల అడ్డగింతలు, ఇనుప గేట్లు నిలువలేదు. సీఐటీయూ జిల్లా నాయకుడు మల్యాల గోవర్ధన్ ఇనుప గేటు ఎక్కి లోపలికి దుకారు. ఈ ఉత్సాహంతో నాయకులు, ప్రజలు గేట్లు తోచుకుంటూ ముందుకు సాగారు. దీంతో తాళం విరిగి గేటు తెరుచుకుంది. 'పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలి' 'ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లారు. కలెక్టరేట్ లోపల మరోసారి బారికేడ్లతో ఆందోళనకారులను పోలీసులు నిలువరించారు. దీంతో మరోసారి అక్కడ ధర్నా చేపట్టారు. 'ఎండలో మేము.. ఏసీల్లో మీరా?' 'కలెక్టర్ బయటకు రావాలి' 'ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి' అని నినాదాలు చేశారు. అయితే ప్రతినిధి బృందాన్ని కలెక్టర్‌తో కలిపిస్తామని పోలీసులు చెప్పగా... కలెక్టర్ బయటకు వచ్చి మా బాధలు వినాల్సిందే అని స్పష్టం చేశారు. దీంతో కలెక్టర్ పరిపాలన అధికారి ప్రశాంత్ ప్రజాసంఘాల నాయకుల వద్దకు వచ్చి నచ్చజెప్పేందుకు యత్నించారు. కానీ అందుకు ప్రజాసంఘాల నాయకులు అంగీకరించలేదు. 'సార్.. మీకు చాలాసార్లు వినతిపత్రాలు అందజేశాం. గతంలో అందజేసిన సమయంలో పది రోజుల్లో సర్వేయర్ వస్తారన్నారు. కానీ ఇప్పటి వరకు రాలేదు. మా బాధలు కలెక్టర్ వినాల్సిందే' అని స్పష్టం చేశారు. అయితే ఏఓ స్వయంగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి సమస్యను వివరిస్తామని హామీఇచ్చారు. దీంతో ప్రజాసంఘాల నాయకుల ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. విన్నపాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. నిజామాబాద్ జిల్లాలో పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాల్లో జీఓ నెం.58 ప్రకారం సర్వే చేయించి పట్టాలు ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా సర్వేయర్‌ను పంపుతామని కలెక్టర్ హామీనిచ్చారు. ప్రజాసంఘాల నాయకుల పోరాటంతో కలెక్టరేట్ పూర్తిగా స్తంబించింది. వందలాది మంది రోడ్డెక్కడంతో కలెక్టర్ సమీపంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

అంతకముందు ధర్నానుద్దేశించి తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 64 కేంద్రాల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, అందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పేదవాడికీ 120 గజాల స్థలం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మిలో అందించే ఆర్థికసాయం రూ.3 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోదని స్పష్టం చేశారు. ఆ సాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక కొత్తగా తీసుకొచ్చిన డిమాండ్ కాదని, బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోల్లోనే పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పూర్తి చేసిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లు పంపిణీకి నోచుకోవడం లేదని, ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అర్హులందరికీ పంపిణీ చేయాలన్నారు. ఒకవేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇండ్లు, ఇండ్ల స్థలాలపై స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నుర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో జాన్కంపేటలో, ఆర్మూర్ సుందరయ్య కాలనీ, నిజామాబాద్ దుబ్బ. బహుజన కాలనీ, నవీపేట్ పీఎస్‌కాలనీలో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, అందరికీ పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన అని, రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని పేదలను మోసం చేశాయని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు ధ్వంసమవుతున్నా పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. పంపిణీ పూర్తయ్యేలోపు పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. పేద ప్రజలతో చెలగాటమాడిన ఏ సర్కారు నిలవలేదని, బీజేపీ, బీఆర్ఎస్‌కూ అదే గతి పడుతుందని స్పష్టం చేశారు. ఈ పోరాటం ముగింపు కాదని, ఆరంభమని అన్నారు. పేదల ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కొండ గంగాధర్, వడ్డేర వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ, అధ్యక్షులు సాయిలు, ప్రజా సంఘాల నాయకులు గోవర్ధన్, కటారి రాములు, లావణ్య, నర్సయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, మహేష్‌తో పాలు వందలాది మంది ప్రజలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.


గేటును తోసేసి కలెక్టరేట్‌లోకి వెళ్తున్న నాయకులు, ప్రజలు


మాట్లాడుతున్న ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్


ప్రజాసంఘాల పోరాట వేదిక ప్రతినిధుల బృందాన్ని కలెక్టర్ వద్దకు తీసుకెళ్తున్న ఏవో..


కలెక్టర్‌కు ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యపై వివరిస్తున్న నాయకులు

బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రవేశాల జాబితా విడుదల

- ఈ నెల 7, 8, 9న కౌన్సెలింగ్
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు 161 సీట్లు

నవతెలంగాణ-బాసర


విద్యార్థుల జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

నిర్మల్ జిల్లాలోని బాసర (త్రిపుల్‌ఐటీ) ఆర్జీయూకేటీ యూని వర్సిటీలో 2023-24విద్యా సంవ త్సరానికి గాను పీయూసీ మొదటి సంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల ప్రవేశాల జాబితాను సోమవారం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ వెంకట రమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ విడుదల చేశారు. యూనివర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 1404 సీట్లకు గాను, 13,538 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎంపికైన 1404 మంది విద్యార్థుల వివరాలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులలో బాలికలు 67 శాతం సీట్లు, బాలుర 33 శాతం సీట్లు పొందినట్లు పేర్కొన్నారు. ఆర్జీయూకేటీలో 99 శాతం సీట్లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పొందినట్లు తెలిపారు. అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 322 సీట్లు దక్కగా అత్యల్పంగా జోగులాంబ, గద్వాల్ జిల్లాకు 2 సీట్లు వచ్చాయని తెలిపారు. కామారెడ్డి జిల్లాకు 93, నిజామాబాద్ 68 సీట్లు వచ్చాయి. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 7, 8, 9 తేదీల్లో 500 మంది విద్యార్థుల చొప్పున యూనివర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహి స్తామని తెలిపారు. ఐఐటీకి 6 గురు విద్యార్థులు ఎంపికైనట్లు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని, రాబోయే సంవత్సరం నుండి 100 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉంటరాని తెలిపారు. విద్యార్థులకు 2,200ల్యాప్‌ట్యాప్‌ను కొనుగోలు చేశామని, నూతన విద్యార్థుల కోసం తరగతి గదులు మరమ్మత్తులు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆయా విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒంటికి, రెంటికి.. ఇంటికే

- మరుగుదొడ్లు కూల్చేడయంతో విద్యార్థులకు ఇక్కట్లు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

నవతెలంగాణ-బిచ్కుంద


మరుగుదొడ్డి కూల్చివేసి చదును చేసి వదిలేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని హస్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బాలికల అవస్థలు వర్ణనాతీతం. విద్యార్థులు ఆరుబయటే కాలుకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హస్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు 172 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 82 మంది బాలికలు ఉన్నారు. వేసవికాలంలో పాఠశాలకు సెలవులు ఉండడంతో పాఠశాల ప్రాంగణంలో గల గ్రౌండ్ లెవెల్ పనులు చేపడుతూ స్థానిక సర్పంచ్, కాంట్రాక్టర్ పాఠశాల ప్రాంగ ణంలో గల మరుగు దొడ్లను ప్రధానోపాధ్యాయుని అనుమతి లేకుండానే కూల్చి వేశారు. మళ్లీ కట్టాల్సి ఉండగా విస్మరించారు. జూన్ నెలలో పాఠశాలలు మొదలు కావడంతో ఇక్కడ విద్యబ్యాసం చేస్తున్న విద్యార్థు లు మరుగుదొడ్ల సౌకర్యం కోల్పో యారు. దీంతో కాలకృత్యాలకు ఆరుబయటే వెళుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

స్థానికంగా ఉండే హస్గుల్ గ్రామానికి చెందిన అమ్మాయిలు వారి ఇంటికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే విద్యార్థినుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఉదయం వచ్చిన వారు సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లిన తర్వాతే కాలకృత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో విద్యార్థినుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి అనారోగ్యానికి గురై వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే పాఠశాలలో డ్రాపవుట్స్ పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు పాఠశాలలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి త్వరగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ఇంటికే వెళ్తున్నాం



భార్గవి. పదవ తరగతి, హస్గుల్.

పాఠశాలలో మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటికి వెళుతున్నాము. దీంతో చదువుకునే సమయం వృథా అవుతున్నది. మా ఇబ్బందులను సమస్యలను అర్థం చేసుకొని మరుగుదొడ్లు నిర్మించాలి.

నీళ్లు తాగడం లేదు



శృతి. పదవ తరగతి. సిర్ సముందర్

స్కూల్‌లో బాత్‌రూం లేక తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. సాయంత్రం ఇంటికి వెళ్లాకే బాత్‌రూం వెళ్తున్నాం. స్కూల్‌లో బాత్‌రూం లేక నీళ్లు కూడా సరిగ్గా తాగడం లేదు. నీళ్లు తాగకపోతే అనారోగ్యానికి గురవుతాం. ఇలాగే కొనసాగితే పాఠశాల మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలి.

లింక్ పంపి డబ్బులు కాజేత

నవతెలంగాణ-పిట్లం

పలువురి వ్యక్తుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్న సైబర్‌నేరగాళ్లు అందినకాడికి దండుకుంటున్నారు. ఏదో ఒక రూపంలో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా లింక్ పంపి ఖాతాదారుని అకౌంట్ నుండి డబ్బులు కాజేసిన ఘటన మండలంలోని అల్లాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా కొనసాగుతున్న విషయం పై పసిగట్టిన సైబర్ నేరగాళ్లు మీ భార్య పేరిట డ్వాక్రా సంఘంలో తీసుకున్న లక్ష రూపాయల రుణానికి పావుల వడ్డి వచ్చిందని నమ్మబలికించి లింకు పంపి క్లిక్ చేయాలని సూచించడంతో వారి మాటలను నమ్మి లింకు ఓపెన్ చేయడంతో తన బ్యాంకు అకౌంటు నుండి 21 వేల 500 రూపాయలు మాయమైనట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేపట్టారు.

గుంట భూమినీ ఎండనివ్వం

- అన్నదాతలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

నియోజకవర్గంలో రైతుల సాగు భూమిని గుంట కూడా ఎండనివ్వమని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మోస్రా మండలం గోవూరు, చింతకుంట గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. గోవూర్‌లో కాకతీయ కళా తోరణాన్ని ప్రారంభించారు. చింతకుంట ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. చింతకుంట గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ శంకుస్థాపన చేశారు. చింతకుంటలో నిర్వహించిన సభలో స్పీకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో నిజాంసాగర్ ప్రాజెకుపై లక్ష ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉందని, కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలలను కొండపోచమ్మ సాగర్ నుంచి నిజాంసాగర్‌కు మళ్లిస్తున్నట్టు తెలిపారు. చందూర్, జాకోరా, చింతకుంట లిఫ్ట్ పనులు, సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గుంటకు సాగు నీరందించేలా పనులు చేస్తున్నామని అన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రూ. 2000 ఫించన్ ఇస్తున్నామని తెలిపారు. అయితే ఖమ్మం సభలో రాహుల్ గాంధీ రూ.4 వేలు ఇస్తా అని ప్రజలకు మాయ మాటలు చెబుతున్నారని, మొదట కాంగ్రెస్ పరిపాలించే రాష్ట్రాల్లో ఇచ్చి తర్వాత తెలంగాణలో ఇద్దురని ఎద్దేవ చేశారు. ఏ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయో ప్రజలకు బాగా తెలుసని అన్నారు. కేసీఆర్‌ను గెలిపిస్తాం.. మేము కూడా గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్లా ఉమా, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్లా శ్రీరాములు, సర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, విమల లింగయ్య, సుమలత రాంరెడ్డి, సున్నం భూమయ్య మండల అధ్యక్షులు హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కత్తి శంకర్, కో ఆప్షన్ నెంబర్ పేరోజ్ ఖాన్, పిఏసిఎస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో గురుపూజోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని జెంటిల్ కిడ్స్ పాఠశాలలో సోమవారం గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గురువుల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల అభివృద్ధికి గురువులు నిర్విరామ కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



రూరల్ మండలం కొత్తపేట్ గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ అలీ అబ్బాయి షేక్ హర్షాన్ అనారోగ్యం కారణంగా వైద్యం చేయించారు. ఈవిషయాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకోని వెళ్లారు. లక్ష రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరుచేయించి బాజిరెడ్డి జగన్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొల్లెంక గోపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావ్, సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, పార్టీ రూరల్ మండల యువ నాయకులు శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం గేటుకు తాళం.. ట్రాఫిక్ జామ్



నిలిచిపోయిన వాహనాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ధర్నాతో కలెక్టరేట్ కార్యాలయం గేటు మూసివేయడంతో లోపల ఉన్న ఫిర్యాదు దారులు అలాగే ఉండిపోయారు. బయట నుండి కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్ళే వారు వెళ్లలేకపోయారు. ప్రజావాణికి వచ్చిన మరికొంతమంది బాధితులకు లోపలికి అనుమతించ కుండా చిన్న గేటుకు కూడా తాళం వేసి ఉంచారు. దీంతో బాధితులు లోపలికి పంపించకపోతే ప్రజావాణి ముగిసిపోతుందని ఆందోళన వ్యక్తం చేయడంతో గేటు తాళం తీశారు.

గురువులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత

- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- ఆలయాల్లో అన్నదానాలు

నవతెలంగాణ-విలేకరులు

ఆర్మూర్: మండలంలోని చేపూర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం అన్నదాత చేపూర్ గ్రామ వాస్తవ్యులు శెట్టి కిషన్ ఆధ్వర్యంలో "గురు పౌర్ణమి" సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసి బాల నర్సయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, గౌరవ అధ్యక్షులు, కోశాధికారి సురేష్ రుక్మాజీ మాట్లాడుతూ... గురు పౌర్ణమి సందర్భంగా అన్నదానం చేసిన శెట్టి కిషన్‌కు అభినందనలు, ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, సాయిబాబా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్. అశోక్, ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్, సలహాదారులు కత్తి శ్రీను, బి.సాయన్న, ఎం.గిరీష్, దేవిదాస్, స్వామిదాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని సిద్దులగుట్ట శివాలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్చార్జి రాజేశ్వర్ రెడ్డి దంపతులు, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితపవన్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవీపేట్: మండలకేంద్రంలోని బ్రహ్మంగారి మందిరంలో వ్యాస పౌర్ణమి వేద వ్యాస మహర్షి జన్మదినం అభ్యుదయ గ్రామీణ వికాస సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో దొండి నరేంద్ర శేఖర్, గంజి సాయన్న నాంపల్లి వసంత్, జీడిపల్లి రాజారెడ్డి మేక లక్ష్మణ్, సూరిబాబు, పుట్ట శ్రీనివాస్ గౌడ్, బుడ్డ సంజీవరెడ్డి, శేఖర్, అల్లి రమేష్ పాల్గొన్నారు.



ఆర్మూర్ : గురువును సన్మానిస్తూ..

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద గల సాయిబాబా ఆలయంలో సాయి సేవాసమితి, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సాయి సేవాసమితి కమిటీ సభ్యులు నార్ల రాజ్, కొమ్ముల సాయరెడ్డి, బ్రమ్మదండి వెంకట్, రాంరెడ్డి, గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షులు కంచు విజయ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్



సన్మానిస్తున్న టీఎన్‌జీవోలు, ఎంప్లాయిస్ జేఏసీ సభ్యులు

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ గా రెండవసారి బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర చైర్మన్ లింబాద్రిని టీఎన్జీవో పక్షాన ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టిఎన్జీవో కేంద్ర సంఘ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్ అధ్యక్షతన సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ , టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, కేంద్ర కార్యవర్గ సభ్యులు పోల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ



బిస్కెట్లు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాము, సభ్యులు చిల్క దినేష్, శంకర్, లోక నర్సయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

5న స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 5న జక్రాన్పల్లి మండల కేంద్రంలోని -స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగవ తరగతి 5వ తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్స్ మండల స్థాయిలో ఎంపిక నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ శ్రీనివాస్, మండల ఫిజికల్ డైరెక్టర్ వేముల నాగభూషణం సంయుక్తంగా ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. హకీంపేట్ కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లకు మండల స్థాయి ఎంపికలు మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని పిడి నాగభూషణం తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న వారు 01.9. 2014 నుండి 31.08. 2015 లోపు జన్మించిన వారు, ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు 01.09.2013 నుండి 31.08.2014 లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపికకు వచ్చే విద్యార్థులు ప్రస్తుత పాఠశాలలో సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్ తహసీల్దార్‌తో ధ్రువీకరించబడింది ఉండాలని , 10 లేటెస్ట్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు , ప్రోగ్రెస్ రిపోర్టు థర్డ్ క్లాస్ నుంచి ఫోర్త్ క్లాస్ నుంచి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్ తేవాని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొనే విద్యార్థులకు హైటు వెయిట్ 30 మీటర్స్, ఫ్లేయింగ్ స్టార్ట్, స్టాండింగ్ , 800 మీటర్స్, షాట్ రన్, తదితర అంశాలపై పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారిని జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి ఎంపికకు వచ్చే విద్యార్థులు ఈనెల 5న 8గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని తెలిపారు.

హక్కు పత్రాలు సరే.. వాటిలో విస్తీర్ణం ఏది?

- రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి

నవతెలంగాణ-సిరికొండ

గిరిజనులకు పోడు భూముల హక్కు పత్రాలు అందజేశారు కానీ కొంతమందికి అందులో ఎంత విస్తీర్ణం అనేది స్పష్టం చేయలేదని, పోడు భూముల హక్కు పత్రాలు అర్హులకు పూర్తిగా అందించలేదని, కాంగ్రెస్ పార్టీ రూరల్ ఇన్చార్జి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఆయన గిరిజనులతో మాట్లాడారు. అర్హులైన వారందరినీ పక్కన పెట్టారని అన్నారు. ఇకనైనా అర్హులందరికీ పోడు భూముల హక్కు పత్రాలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కొండాపూర్ గ్రామంలో 20 మంది మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి ,మండల అధ్యక్షులు బకారం రవి, మండల యూత్ అధ్యక్షులు భూషణ్ రెడ్డి, సంతోష్, రమేష్, ఎర్రన్న, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపతిరెడ్డి

7న ఆర్డీఓ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్రమధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముందు ఈనెల 7న నిర్వహించే ఆర్డిఓ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈనెల 10 నుండి జరిగే నిరవధిక సమ్మెకు సంబంధించిన నోటీసులు సోమవారం సమాచార ఎంఈవో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చక్రపాణి లు మాట్లాడుతూ గత నెల 5 నుండి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగం కార్మికులకు చెల్లించాల్సిన తొమ్మిది నెలల బకాయి బిల్లులను చెల్లిస్తామని హామీలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈనెల 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె దిగుతున్నామని, అధికార యంత్రాంగం సహకరించాలని కార్మికులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు సాయమ్మ, లావణ్య, రూరల్ మండల్ నాగమణి, శోభ, సాయిలత, పుష్ప కార్మికులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ మానస డాక్టర్ ఉమేరా యాస్మిన్‌ను వైద్య సిబ్బంది శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రోగులకు సరైన వైద్యం అందించినప్పుడే తన వృత్తికి సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బందిని ఎల్లవేళలా ప్రజలు మరిచిపోలేరని తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు రవీందర్ ఆనవాల ఫార్మసిస్ట్ లక్ష్మణ్ ,స్టాఫ్ నర్సులు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డిపై నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదు

బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రశాంత్ రెడ్డిపై నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు సోమవారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం మాట్లాడుతూ... బీజేపీ బాల్కొండ స్వయం ప్రకటిత ఎమ్మెల్యే అభ్యర్థి మల్లికార్జున్ రెడ్డి నియోజవర్గంలో సమస్యలే లేనట్లు పదే పదే బట్టాపూర్ క్రషర్ విషయాన్నే మాట్లాడుతున్నారని, క్రషర్ మిషన్ లు నిజామాబాద్ జిల్లాలో ఎక్కడ లేవా అని ప్రశ్నించారు.మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకపోతున్నారని, చేతనైతే కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉంది కదా నిధులు తెచ్చి ఏర్గట్ల మండలాన్ని అభివృద్ధి పరచాలని కోరుతున్నానన్నారు. 1985-86 లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఏర్గట్లను మండలంగా ప్రకటిస్తే అడ్డుపడ్డది మీ నాన్న మహిపాల్ రెడ్డి కాదా.. అని అడుగుతున్నానన్నారు. ఆ సమయంలో ఏర్గట్ల గ్రామంలోకి రానీయకుండా మీ నాన్నను ఎలాగైతే అడ్డుకున్నారో నీకు అదే గతి పడుతుందని విమర్శించారు. ప్రశాంత్ రెడ్డిపై, ఆయన బంధువులపై ఉన్న విద్వేషాన్ని కంకర మిషన్ రూపంలో వెళ్ళగక్కుతున్నట్లు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. క్రషర్ మిషన్ లో ఏమైనా అవినీతి జరిగితే సంబంధిత శాఖ అధికారులకు తెలపాలని, మిషన్ ఇక్కడి నుండి పోతే, ఇంటి నిర్మాణానికి ప్రజలు వేరే ప్రాంతం నుండి కంకర తెచ్చుకుంటే ప్రజలకు ఎక్కువ ఖర్చు అవుతుందని అన్నారు. ఏర్గట్ల ప్రజలు చైతన్య వంతులని, వారికి ఏది నిజం, ఏది కలనో తెలుసని, మంత్రిపై నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ మాట్లాడుతూ... మల్లికార్జున్ రెడ్డికి ఏమి పనిలేకపోతే, ఏదైనా పని వెతుక్కుని చేసుకోవాలని, వార్డ్ మెంబర్ గా కూడా గెలవని ఆయన మంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ఏంటని అన్నారు. నీవు మంత్రిపై ఒక్కటి మాట్లాడితే, మేము నీపై లక్ష మాట్లాడుతామన్నారు. ప్రశాంత్ రెడ్డిపై మాట్లాడేంత స్థాయి నీకు లేదని అన్నారు. నీకు అంతలా మాట్లాడాలని ఉంటే ఏర్గట్ల స్థూపం వద్ద డిబేట్ పెట్టుకుందాం రా...అని మల్లికార్జున్ రెడ్డికి సవాల్ విసిరారు. సమావేశంలో ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్లు పత్తిరెడ్డి ప్రకాష్, కుండ నవీన్, ఏర్గట్ల పిఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య వైస్ చైర్మన్ సిగసారం గంగారాం,నాయకులు నెరేళ్ళ లింగారెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, కట్కం సాగర్,సామంత్ రెడ్డి,వేశాల నర్సారెడ్డి,ఆకుల రాజేంధర్,నర్ర అశోక్,కూతురు సాయన్న,మురళి రాంపెల్లి,చిల్క కిషన్,మూడ్ గంగారాం,గన్నారపు రాజేశ్వర్, కూశ లింబాద్రి, తోకల ఈశ్వర్, భీమ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం

చెరువు తూము నిర్మాణం పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ఊర చెరువుకు తూము నిర్మాణం పనులను సోమవారం సర్పంచ్ పెండ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ ఊర చెరువు ఆయకట్టు కింద గత కొంత కాలంగా తూము లీకేజీ అయ్యి చెరువులో నీరు వృధాగా పోవడంవల్ల చెరువు ఏరియా చుట్టుపక్కల పంటలకు నీరు అందక ఎండి పోయేవన్నారు. ఈ విషయాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే కొత్త తూము నిర్మాణంకోసం రూ.15లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతుగంటి స్వామి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గొర్రె గంగన్న, వెంకటి నర్సయ్య, కొండాపురం సాయిరెడ్డి, సురేష్, వేముల నిఖిల్, గణపురం రాజు, లక్పతి, తదితరులు పాల్గొన్నారు.

'కరపత్రం రాసెద్దామా' కవితకు ప్రశంసాపత్రం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రాష్ట్రాల అంతర్జాల కవి సమ్మేళనంలో "కరపత్రం రాసెద్దామా" అనే శీర్షికతో యెనుగందుల శంకర్ వ్రాసిన కవితకు ప్రశంసా పత్రం లభించింది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, యానం, ఒరిస్సా, పాండిచ్చేరి, రాష్ట్రాలకు చెందిన 80 మంది కవులు ఇందులో పాల్గొన్నారు. ప్రశంసా పత్రం అందించిన జాతీయ అధ్యక్షులు పిఆర్ఎస్ఎస్ఎన్ మూర్తి, ప్రధాన సలహాదారుడు కిలపర్తి దాలి నాయుడు, ప్రధాన కార్యదర్శి మోటూరు నారాయణరావు, అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పైడి నవనీత రవిందర్‌కు యెనుగందుల శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ సక్కారం అశోక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చౌట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియ సీజనల్‌గా వచ్చే మలేరియా వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందడం వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరుబయట వాడకుండా పక్కన పెట్టిన వస్తువుల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడతారన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో అశ్రద్ధ చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆస్పత్రి సూపరిడెంట్ సత్యనారాయణ, సిబ్బంది పవన్, రవి, ఏఎన్ఎంలు రూప, అరుణ, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, బిఆర్ఎస్ నాయకులు సక్కారం నారాయణ, రాజు, నెల్ల రమేష్, సాగర్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుప్రియ

కాంగ్రెస్ పార్టీ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరుతున్నాడనడం సరికాదు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి



మాట్లాడుతున్న మండల అధ్యక్షులు బొదిరెస్వామి

నవతెలంగాణ-భీంగల్

కాంగ్రెస్ పార్టీ నుండి గతంలోనే తప్పించిన వారిని పట్టుకొని కాంగ్రెస్ నాయకుడు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నాడని మంత్రి అనడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి అన్నారు. సోమవారం పట్టణకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భీంగల్ పట్టణకేంద్రానికి చెందిన కర్నె సత్య గంగయ్య 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన పరిణామాల వల్ల కాంగ్రెస్ పార్టీనుండి తప్పించి దూరం పెట్టడం జరిగిందని అన్నారు. భీంగల్ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కౌన్సిలర్‌కు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన విషయం గుర్తు చేశారు. అలాంటి వారిని పట్టుకొని కాంగ్రెస్ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరుతున్నాడని అనడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. సమావేశంలో డిసిసి డెలిగేట్ కుంట రమేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్ర, ఎస్టీఎస్సీ సెల్ అధ్యక్షులు గోపాల్‌నాయక్, అనంతరావ్, అవినాష్, సాగర్,శివ, క్రాంతి తదితరులున్నారు.

బీఆర్ఎస్ పార్టీవి పచ్చి అబద్దాలు

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోగా ఇప్పుడు బీజేపీపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని బిజేపీ పార్టీ మండల అధ్యక్షుడు మూలిగే మహిపాల్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిరుద్యోగులకు భృతి, దళితున్ని సీఎం చేస్తానని చెప్పి విస్మరించడం అబద్దపు ప్రచారాలని అన్నారు. సమావేశంలో మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ అఫ్ నవనాతపురం ఆధ్వర్యంలో రాంమందిర్ పాఠశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం టాపిక్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నిత్యం ఉపయోగించుకోవాలని జూట్ సంచులు పంచారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఒక సెకండ్ కు లక్ష ప్లాస్టిక్ సంచులు వాడుతున్నట్లు తెలిపారు. దీని వల్ల ప్లాస్టిక్ భూమిలో కలసిపోయి చుక్క నీరు కూడా భూమిలో ఇంకకుండా చేస్తుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలసిపోవడానికి వెయ్యి యేండ్లు పడుతుందని తెలిపారు. ప్లాస్టిక్‌ని నిషేధించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చలం, లయన్స్ క్లబ్ కార్యదర్శి రఫీద్దీన్, మ్యాదరి రాజన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుంభకోణం అనేది అవాస్తవం

- మూడో కల్లుడిపో అధ్యక్షులు స్వామిగౌడ్



మాట్లాడుతున్న కల్లుడిపో అధ్యక్షులు స్వామిగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కుంభకోణం అనేది అవాస్తవమని మూడవ కల్లు డిపో అధ్యక్షులు స్వామి గౌడ్ ఆరోపించారు. ప్రెస్ క్లబ్ లో మూడవ కల్లు డిపో గీత కార్మికులు ఆధ్వర్యంలో సోమవారం మీడియా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడవ డిపో అధ్యక్షులు స్వామి గౌడ్ మాట్లాడుతూ... మూడవ కల్లు డిపో లో ఎలాంటి అక్రమాలు జరగ లేదని, అంత గీత కార్మికులకు లెక్కలు తెలుసని, సంబంధం లేని వారు తెలియకుండా మాట్లాడడం సరికాదని అన్నారు. గ్రామాల నుంచి వచ్చిన అర్హులైన గీత కార్మికులకే కల్లు డిపో లో సభ్యత్వం ఇచ్చామని తెలిపారు. కావాలనే తిరుమలేష్ గౌడ్, అడ్వకేట్ గంగాధర్ గౌడ్ లు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సుమన్ గౌడ్, రాజా గౌడ్, బోజ గౌడ్, నర్సాగౌడ్‌తోపాటు గీత కార్మికులు పాల్గొన్నారు.

మువ్వకు సన్మానం

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని మాధవ విద్యానికేతన్ వ్యవస్థాపక అధ్యాపకులు మువ్వ నాగేశ్వర్ రావును గురుపూజోత్సవం సందర్భంగా శిష్య బృందం సోమవారం శాలువతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా మువ్వ నాగేశ్వర్ రావు ఉపాధ్యాయుడిగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వడ్డీ మోహన్ రెడ్డి, సత్యం రెడ్డి, ఆనంద్, బాలగంగాధర్, రాజేందర్ గౌడ్, నాగభూషణం, భూషణ్, రత్నాకర్, బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాసర త్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక




నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని తలమడ్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు అంజలిరెడ్డి సోమవారం పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంగ వైష్ణవి (10జీపీఏ), ర్యావ కుమార్ (9.7జీపీఏ)లు సాధించడంతో ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరి ఎంపిక పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులను సర్పంచ్ యాదవరెడ్డి, ఎంపీటీసీ రాజు, ఎస్ఎంసీ చైర్మన్ స్వామి, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గుర్జల్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీశ్రీ వనదుర్గ పెద్దమ్మ ఆలయానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తూర్పురాజు 50 బస్తాల సిమెంటును ముదిరాజ్ సంఘం పెద్దలకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గాండ్ల లక్ష్మణ్, ఆకుల లక్ష్మణ్, భాస్కర్, సోప్పరి గంగారం సోప్పరి పండరి రాములు, బలరాం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాల పంపిణీ
సీఎం కేసీఆర్ ఘనతే



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ-బోధన్

ఎన్నో సంవత్సరాల నుంచి అపరిష్కృతంగా ఉన్న పోడు భూములకు పట్టాల పంపిణీ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానంతోనే నేడు తెలంగాణ రాష్ట్రంలో సాధ్యమైందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన నవీపేట్ మండలంలోని గిరిజన వాసులకు పోడు భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పరిపాలించిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలను ఇవ్వలేకపోయారని, అలాంటి సమస్యను తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో సాధ్యమైందని అన్నారు. అనంతరం రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి గ్రామస్తులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఇల్లు లేని నిరుపేదలు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వ స్థలాలను గుర్తించి వారికి అందిస్తున్నామని అన్నారు. జానకంపేట్ గ్రామంలో వికలాంగులకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. త్వరలో మరిన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం పట్టాల పంపిణీ చేస్తామన్నారు. అలాగే అర్హులైన వారందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా డబుల్ బెడ్ నిర్మాణానికి మూడు లక్షలు మంజూరు చేస్తామన్నారు. పోడు భూముల కోసం 70 సంవత్సరాలుగా జరుగుతున్న పోరాటం తెలంగాణ రాష్ట్రం సాధనతోనే సాధ్యమైందని అన్నారు. ఈ పట్టాలు పంపిణీతో గిరిజనుల కల సాకారం అయిందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గిరిజనుల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఇందూర్ హైస్కూల్లో నిర్వహించే ఉద్యోగ మేళాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సూచించారు. ఈ ఉద్యోగమేళాలో 80 కంపెనీలు పాల్గొంటున్నాయని, కావున టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై స్థాయి చదివిన నిరుద్యోగులు ఈ ఉద్యోగమేళాలో పాల్గొనాలని సూచించారు. ఇప్పటివరకు ఆన్లైన్ ద్వారా 80శాతం వరకు నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నారని, ఆన్లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకొని వారు కూడా ఉద్యోగ మేళాలో పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగ మేళా నిర్వహించే ఇందూర్ హైస్కూల్‌ను సందర్శించి పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, నవీపేట్ మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, బోధన్ పట్టణ నాయకులు గుమ్మల అశోక్ రెడ్డి, కౌన్సిలర్ దూప్ సింగ్, బీఆర్ఎస్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

మంధర్నాలో భూమి పట్టాలివ్వాలని ఎమ్మెల్యేకు వినతి..

సాలూర మండలంలోని మంధర్న గ్రామంలో గత 30 సంవత్సరాలుగా భూమిని దున్నుకుంటూ జీవనం సాగిస్తున్న కొన్ని వందల రైతు కుటుంబాలకు పట్టా పాస్ బుక్ అందజేసి ఆదుకోవాలని కోరుతూ సోమవారం మందర్న గ్రామస్థులు ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వందల సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న భూమి పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కావున త్వరలో సాగు చేసుకుంటున్న భూములకు అర్హులైన వారికి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు. గ్రామస్తుల విన్నపానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఆ భూములకు సంబంధించిన సమస్యను సంబంధిత శాఖ అధికారులకు పంపి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ శివ కుమార్, నాగురావు, నరేష్, జ్ఞానేశ్వర్, చాందు, రవి, బాబు, చింటు, బీఆర్ఎస్ కార్యకర్తలున్నారు.

వరుణుడు కరుణించాడు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల రైతులు వర్షం కోసం దాదాపు నెల రోజుల నుంచి ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. జూన్ మొదటి వారంలో వర్షాలు పడాల్సి ఉన్నా.. తగినంత వర్షాలు కురియలేదు. 15 రోజుల క్రితం కొద్దిపాటి జల్లులు పడడంతో రైతులు పలు పంటలను సాగు చేశారు. సాగు చేసిన తర్వాత వర్షం పడకపోవడం 15 రోజుల నుంచి రైతన్నలు ఆకాశం వైపు ఎదురు చూశారు. కాగా ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం వ్యవసాయదారులకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ప్రభుత్వ విప్‌కు సన్మానం



దోమకొండ : విప్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

నవతెలంగాణ-దోమకొండ/భిక్కనూర్

మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలోని గౌడ సంఘం కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేసినందుకు గౌడ సంఘం సభ్యులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్ నివాసంలో కలిసి విప్ గంపగోవర్ధన్‌ను శాలువాతో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, నియోజకవర్గంలో కుల సంఘాల అభివృద్ధి కోసం భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గంద్ర మధుసూదన్ రావు, గౌడ సంఘం సభ్యులున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్..

భిక్కనూర్ : మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి అనారోగ్య కారణంగా సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామ్‌రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ గాలిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ అనసూయ, మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

ప్రపంచ మెకానిక్ దినోత్సవం

- టూ వీలర్ మెకానిక్‌ల బైక్ ర్యాలీ



కేక్ కట్ చేస్తున్న మెకానిక్‌లు

నవతెలంగాణ-లింగంపేట్

ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో టు వీలర్ బైక్ మెకానిక్‌లు సోమవారం బైకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర మెకానిక్ కమిటీ పిలుపు మేరకు జులై మూడో తేదీన ప్రపంచ మెకానిక్స్‌డేను నిర్వహిస్తున్నట్టు వివరించారు. అందులో భాగంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మెకానిక్ యూనియన్ అధ్యక్షులు గాజుల బాషు, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, యూసుఫ్, ప్రధాన కార్యదర్శి నరేష్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, లక్ష్మణ్, రవి, అనిల్, శివఅనిల్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ రద్దు చేసి.. కార్పొరేషనే జీతాలివ్వాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి(నిజామాబాద్ సిటీ)

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు రద్దు చేసి సివిల్ సప్లై కార్పొరేషన్ నేరుగా జీతాలు ఇవ్వాలని ఔట్సోర్సింగ్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ కామారెడ్డి ప్రెసిడెంట్ ఎం.శ్రీకాంత్, సెక్రటరీ పులగం సాయికుమార్ అన్నారు. ఔట్సోర్సింగ్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ కామారెడ్డి ఆధ్వర్యంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ అభిషేక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు రద్దు చేసి కార్పొరేషన్ నేరుగా జీతాలు ఇవ్వాలని, గ్రేడ్ 3 క్రింద పరిగనిస్తూ ప్రాథమిక స్థాయి జీతాలు, అటెండర్‌లకు క్లాస్ 4కింద పరిగణిస్తూ ప్రాథమిక స్థాయి జీతాలు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్ నేరుగా కార్పొరేషన్ ద్వారానే జమ చేయాలని, ఎంప్లాయి ఐడీ కార్డ్, ఉద్యోగ భద్రత కల్పిస్తూ, హెల్త్, జీవిత బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కన్వేయన్స్ అలవెన్సు (సిఎ) పెంచాలని, ఇతర జిల్లాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు సొంత జిల్లాలలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని, సేవలు గుర్తించి ఉద్యోగాలకు క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



ఎడపల్లి : సాయిబాబా ఆలయంలో సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. అనంతరం గురు పౌర్ణమి సందర్భంగా ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి రామారావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, పాఠశాల ఉపాధ్యాయుల ఉపాధ్యాయులను సాయి బాబా మహిళా భక్తులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తుల సౌకర్యం మేరకు శ్రీ సాయి సత్సంగ ఆలయంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, జెడ్పి ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు మనిషారెడ్డి, ఎడపల్లి కెనరా బ్యాంక్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, జానకి తదితరులు పాల్గొన్నారు.

గురుపూర్ణమి సందర్భంగా సీనియర్ న్యాయవాదికి సన్మానం..

బోధన్ : గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం బోధన్ కోర్టులో సీనియర్ న్యాయవాది శేఖర్‌కు న్యాయవాదులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ భారతీయ పరంపరలో పెద్దలను, గురువులను సత్కరించటం, గురువుల ఆశీర్వాదం పొదటం ఆనవాయితీగా ఉందని అన్నారు. ఈ సంప్రదాయాన్ని అనుసరించి మేధావి అనుభవజ్ఞుడు అయిన సీనియర్ న్యాయవాది శేఖర్ గురూజీని సత్కరించటం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సిహెచ్.వి.హన్మంతరావు, బి.లక్ష్మణ్, పోశెట్టి, సుధాకర్, కోటేశ్వరరావు, జె.శ్రీనివాస్, తర్ల శంకర్, బాణోత్ రమేష్, జి.రవీందర్, హైదర్, ఆజర్, పి.శంకర్, ప్రకాష్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

6వ రోజుకు చేరిన రైతుల రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని బందల రోడ్డు, మాచాపురం, దూపల్లి ఎక్స్‌రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆరవ రోజుకు చేరుకుంది. ఈ రోడ్ల మరమ్మతులు చేపడితే వందలాది మంది రైతులకు తమ పంట పొలాలకు వెళ్లే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం మొరం పనులు చేపట్టినట్లయితే తిరిగి గుంతలు ఏర్పడి రైతులకు నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతు పనులకు నిధులను కేటాయించి రోడ్ల మరమ్మతులు చేయాలని వారు కోరారు.

75 ఏండ్ల కల.. నెరవేరిన వేళ..

- మదన్‌హిప్పర్గకు బస్సు సర్వీస్ ప్రారంభం
- గ్రామస్తుల్లో ఆనందం



బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా.. బస్సు రాని ఆ గ్రామస్తుల కళ.. సోమవారంతో నెరవేరింది. నూతనంగా ఏర్పడ్డ డోంగ్లి మండలంలోని మదన్‌హిప్పర్గ గ్రామానికి బస్సు సర్వీస్ ప్రారంభించాలని ఇటీవల ఆ గ్రామ సర్పంచ్ రాజు పటేల్ బఆధ్వర్యంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హనుమంతు షిండేకు, బాన్సువాడ బస్సు డిపో మేనేజర్‌కు వినతిపత్రాలను అందజేశారు. దీంతో వారు స్పందించి గురు పౌర్ణమి రోజున గ్రామానికి బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. దీంతో గ్రామ స్తులు ఆనందం వ్యక్త చేశారు. బస్సు డ్రైవర్‌ను, కండక్టర్‌ను సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు పటేల్ మాట్లాడుతూ..

ప్రతిరోజు బాన్సువాడ నుంచి ఈ బస్సు బయలుదేరి మదన్‌హిప్పర్గ గ్రామానికి ఉదయం 8:30 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి వయా డోంగ్లి, మొగా, మేనూర్, మద్నూర్, మీదుగా దెగ్లూర్ బయలుదేరుతుందని తెలిపారు. ఈ బస్సు సర్వీస్ మూలంగా గ్రామ ప్రజలకు ఉదయం పూట దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని, తమ కోరిక మేరకు బస్సు సర్వీస్ ప్రారంభించినందుకు బాన్సువాడ డిపో మేనేజర్‌కు, ప్రజాప్రతినిధులకు సర్పంచ్ గ్రామ ప్రజల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

తూతుమంత్రంగా ఉపాధిహామీ ప్రజావేదిక

- ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండలంలోని 17 పంచాయతీల్లో 2019-22లో జరిగిన సుమారు రూ.7కోట్ల 15 లక్షల 91 వేల 343 రూపాయల విలువైన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరించిన సమాచారం మేరకు డ్వామా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సాయన్న, ఎంపీపీ పాల్య విఠల్ అధ్యక్షతన సోమవారం స్థానిక రైతు వేదిక కార్యాలయంలో బహిరంగంగా ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో జరిగిన అక్రమాలపై సంబంధిత ఉపాధి సిబ్బంది, గ్రామ కార్యదర్శుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. నసురుల్లాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీ పరిధిలో 944 పనులకు 5 కోట్ల 79 లక్షల 21 వేల 722 రూపాయలను కూలీలకు వేతనం చెల్లించారు. అలాగే వస్తువుల రూపంలో కోటి 36 లక్షల 69వేల 621 రూపాయలను ఖర్చు చేశారు. మండలంలో రూ.7కోట్ల 15 లక్షల 91,343 లను ఖర్చు చేశారు. పలు గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మండలంలో వేలాది సంఖ్యలో మొక్కలు ఎండిపోయాయి. పలుచోట్ల ధ్వంసం అయ్యాయి. అంకుల్ తండాలో పనులు చేసిన చోట పలకలు పెట్టకపోవడం, 1800ల మొక్కలు ఎండిపోవడం, సంగం గ్రామంలో కూలీలకు వేతనం ఇవ్వడంలో జాప్యం, హాజీపూర్ గ్రామంలో జాబ్ కార్డు ఒకరిది పని మరొకరిది, కూలీ డబ్బులు ఇప్పించడంలో నిర్లక్ష్యం, దుర్కి గ్రామంలో వందల సంఖ్యలో మొక్కలు ఎండిపోవడంపై పీడీ ఉపాధి హామీ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉపాధి పనులు జరిగిన ప్రదేశంలో పనుల వివరాల బోర్డులు లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మెంబర్ మజీద్, సొసైటీ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, జడ్పీటీసీ జన్నుబాయి ప్రతాప్ సింగ్, డీపీవో, ఏపీడీలు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, డీఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తామని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతీ నెల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు, చేనేత, గీత కార్మికులకు, ఫైలేరియా డయాలసిస్ పేషెంట్‌లకు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అందరు నాయకులు కార్యకర్తలు అభిమానులు విస్తృతంగా ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తామని గొప్పగా చెప్పుకుంటూ పోడు రైతులకు మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు బీద ప్రజలకు గిరిజనులకు ఇచ్చిన పోడు భూములకు అన్నిటికీ ఖచ్చితంగా ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తామని గొప్పగా చెప్పింది తప్ప కొంతమంది రైతులకే పట్టాలిస్తూ కొంతమంది రైతులను మోసం చేస్తున్నారని వివరించారు. అంతకుముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చే పెన్షన్ వివరాల పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ నర్సింహులు, ఆఫీజ్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందలుగా కుక్కల సంచారం

- ఇటీవల కుక్కలను పట్టినా.. వదిలేసింది ఎక్కడ ?



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ప్రతి గల్లీలో కుక్కలు మందలు మందలుగా సంచరిస్తున్నాయి. కుక్కల మందలను చూసి కాలనీవాసులు భయం భయంగా ఉంటున్నారు. ఇటీవల ఒకేరోజు పిచ్చి కుక్కలు ఐదుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఒకరిని నిజామాబాద్‌కు తీసుకువెళ్లగా, మరో చిన్నారిని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్సలు చేయిస్తున్నారు. ఒకేరోజు ఐదుగురు గాయపడ్డ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి కుక్కలను పట్టుకుని తరలించే చర్యలు చేపట్టినప్పటికీ పట్టిన కుక్కలు ఎక్కడ వదిలేశారనే ప్రశ్న గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. కుక్కలను పట్టే వారు ఇక్కడ పట్టి.. కొద్ది దూరంలోనే వదిలేసినట్లు చర్చలు వినబడుతున్నాయి. వదిలిపెట్టిన కుక్కలే మళ్లీ గ్రామంలోకి వచ్చినట్లు ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వజ్రఖండి జీపీని సందర్శించిన డీఎల్పీవో



జీపీని సందర్శిస్తున్న డీఎల్పీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని వజ్రఖండి గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులను డీఎల్పీవో శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారని జేపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంజీవ్ పాటీల్‌తో కలిసి పల్లెప్రగతిలో చేసిన శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, కంపోస్ట్ షెడ్, హరితహారం, నర్సరీ, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో నిర్వహించిన రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులను వందశాతం వసూళ్ల చేయాలని జేపీఎస్‌ను ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని గ్రామ ప్రజల సహకరంతో గ్రామాభివృద్దే ధ్యేయంగా పనులను నిర్వహించాలని డీఎల్పీవో శ్రీనివాస్ సర్పంచ్ పాటిల్‌తో పేర్కొన్నారు. డీల్పీవోతో పాటు గ్రామ సర్పంచ్ సంజీవ్ పాటీల్, జేపీఎస్, జీపీ పాలక వర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అడవి పంది దాడి.. తీవ్ర గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మళ్ళ, మాలోత్ తాండకు చెందిన మాలోత్ మీనా తమ వ్యవసాయ పొలం వద్ద పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన మాలవత్ మీనాను చికిత్స నిమిత్తం లింగంపేట్ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అడవి పంది దాడి విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

అర్హులకే ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-రెంజల్

అర్హులైన నిరుపేదలకే ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని మండలంలోని తాడ్బిలోలి గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ శశి భూషణ్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల గ్రామంలో పట్టాలు పంపిణీ చేయడానికి తహసీల్దార్ రామచందర్ వచ్చారని.. ఆ జాబితాలో అనర్హులు చాలామంది ఉన్నారని, గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులైన వారిని ఎంపిక చేసి నూతన జాబితాను ఏర్పాటు చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారని, దానికి తాము ఒప్పుకున్నామని తీరా ఎవరికి తెలియకుండా సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో పట్టాలు పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానిక యువత ప్రసాద్, మోహన్, శ్రీనివాస్, రవి, సద్దాం, తదితరులున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న మహిళల అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహారాష్ట్రలో కొనుగోలు చేసి నిజామాబాద్ నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. సోమవారం నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని ఆటోనగర్ చెందిన ఫరీదా బేగం, రషీదా బేగం అనే మహిళలు నాందేడ్ జిల్లాలో గంజాయిని రూ.11 వేలకు కొనుగోలు చేసి నిజామాబాద్‌కు తరలిస్తుండగా ఇద్దరి అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించనున్నట్లు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎక్సైజ్ ఎస్సై మల్లేష్, తోటి ఎక్సైజ్ సిబ్బందిని ఆయన అభినందించారు.

జీలుగ సాగుతో భూసారం

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ మండల కేంద్రంలోని జీలుగా క్షేత్రాలను బాల్కొండ మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి సోమవారం సందర్శించి రైతులకు సూచనలు, సలహాలను అందజేశారు. పచ్చి రొట్టె, జీలుగ విత్తనాలను ప్రభుత్వం 65శాతం రాయితీపై రైతులకు అందజేస్తుందని అన్నారు. వరి సాగు చేసే భూముల్లో వేసవిలో పచ్చి రొట్టె, జీలుగును సాగు చేసి ఆఖరి దుక్కిలో కలియదున్నడం వల్ల భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. జీలుగును వేసిన 35 నుంచి 40 రోజుల్లో పూతగా వచ్చే దశలో నేలలో కలియ దున్నడం వల్ల ప్రధాన సూక్ష్మ పోషకాలు 40 నుండి 60 టన్నుల సేంద్రియ పదార్థం భూమిలో చేరి భూసారం పెరుగుతుందని గుర్తుచేశారు. జీలుగు సాగు వల్ల 30శాతం వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని, తద్వారా పెట్టుబడి ఆదా చేసుకోవచ్చని అన్నారు. భూసారం పెరగడం వల్ల పంట దిగుబడి 20శాతం నుంచి 25శాతం మేర పెరుగుతుందన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను కలెక్టర్ సందర్శించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్
- డైట్‌లో తాత్కాలిక బోధనకు నిరుద్యోగులకే అవకాశం కల్పించాలి
- పీడీఎస్‌యూ
- ప్రజావాణికి 135 ఫిర్యాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ


కంఠేశ్వర్ : వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


ప్రజావాణికి 135 ఫిర్యాదులు

ప్రభుత్వ విద్యాసంస్థలను కలెక్టర్ సందర్శించాలి అని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నగర కమిటీ అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి,వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలు అనేక సమస్యలకు నిలయంగా మారిన, ప్రభుత్వ అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. మన ఊరు మన బడి పథకం పనులు కూడా నత్త నడకన సాగుతూ ఎప్పుడు పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితుల్లో ఉండటం బాధాకరం అని అన్నారు. విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు అయిన త్రాగు నీరు, విద్యుత్ సదుపాయం, సరిపడా బత్రూమ్స్ కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న పట్టించుకునే నాథుడే లేరని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించి ,సమస్యల పరష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విశాల్ నగర నాయకులు కిరణ్, సాయి, తరుణ్, మనోజ్, రేహన్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ: డైట్ కళాశాలలో తాత్కాలిక బోధనకు రిటైర్మెంట్ వారికి కాకుండా, అర్హత కలిగిన నిరుద్యోగులకు మాత్రమే అవకాశం కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు.) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు. నిజామాబాద్ నగర అధ్యక్షులు ఎస్కే అహూర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన బోధన చేయడానికి నోటిఫికేషన్ వెలువడిందని అన్నారు. గతంలో ఈ పోస్టుకు రిటైర్డ్ ఉద్యోగులను మాత్రమే తీసుకునేవారని ఇది అన్యాయమని, నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని పిడిఎస్యు పివైఎల్ సంఘాలుగా ప్రభుత్వానికి గతంలో విన్నవించామని తెలిపారు.ఈ నేపథ్యంలోనే కొత్త వారికి కూడా అవకాశం కల్పిస్తూ నోటిఫికేషన్ వచ్చిందని అన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ప్రతినెలా వచ్చే పెన్షన్తో ఆర్థిక భద్రత ఉంటుంది, కానీ నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇకనుండి నిరుద్యోగులకు మాత్రమే బోధన అవకాశం కల్పించాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర పి.డి.ఎస్.యు. నాయకులు సలీం, సందీప్, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామ సర్పంచ్ గుర్రపు స్వప్న

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముంబోజీపేట గ్రామపంచాయతీలో నూతన భవన నిర్మాణం కొరకు సర్పంచ్ గుర్రపు స్వప్న చంద్రయ్య చేతుల మీదుగా సోమవారం భూమి పూజ నిర్వహించారు. మంబోజీపేట గ్రామపంచాయతీ శిథిలావస్థకు చేరడంతో గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి నూతన గ్రామపంచాయతీ భవనం కావాలని తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కొరకు 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాల కల నెరవేరిందని వారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంజయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బోయిని సాయిలు, కార్యదర్శి పవన్, కారోబార్ గోవిందరావు, లింగం, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులను కల్పించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ.. భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ కోర్సు లేకపోవడం, సరిపడా భవనాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రహరీ లేకపోవడం ద్వారా పరిసర ప్రాంతాల నుంచి పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి నగర ఇంఛార్జి సంజయ్, నగర కార్యదర్శి సమీర్, నితిన్, సందీప్, నిషాంత్, రాహుల్, రాజేశ్వరి, రేణుక, వర్ష నగ్రీన్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత


సహాయనిధి చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్ తాండకు చెందిన గోగులోత్ మోతిరాం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందగా సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.16 వేల చెక్కును ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, సర్పంచ్ చందర్ నాయక్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భార్య లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, మండల రైతు బంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, జిల్లా డైరెక్టర్ రాజేందర్, ఉప సర్పంచ్ సర్మన్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తుపాకుల రాజేందర్ గౌడ్, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎంఈఓకు వినతి

నవతెలంగాణ-బోధన్


వినతిని అందజేస్తున్న విద్యార్థి సంఘాలు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిలభారత విద్యార్థి బ్లాక్ సంఘం ఆధ్వర్యంలో బోధన్ ఎంఈఓ నాగనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిలభారత విద్యార్థి బ్లాక్ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, పాఠ్యపుస్తకాలు అందని పాఠశాలలకు తక్షణమే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పీఈటీలను నియమించాలని, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు మరమ్మతులు చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు మరుగుదొడ్లు, ఆట వస్తువులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రతి స్కూలుకు ప్రహరి గోడలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులో విద్యా వాలంటీర్లను నియమించాలని, మధ్యాహ్నం భోజనం మెనూ పెంచాలని, విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థి సంఘ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న, గంగ ప్రసాద్, రఘు, శీను, ధనరాజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

72 మంది విద్యార్థులకు ఒకే టీచర్

- ఇదేనా బంగారు తెలంగాణ?
- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

72 మంది విద్యార్థులకు ఒకే టీచర్ విద్యా బోధన చేయడం బంగారు తెలంగాణకు, ప్రభుత్వ పనితనానికి నిదర్శనమని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం మండలంలోని స్కూల్ తండా, బట్టు తాండ, జగదాంబ తాండతో పాటు, మద్దికుంటలో మండల పరిషత్, జిల్లా పరిషత్‌తో పాటు అంగన్వాడీ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ఎన్నికల హామీనిచ్చి, ప్రభుత్వ విద్యాలయాలను సమస్యలకు నిలయంగా మార్చిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. బట్టు తండాలో 72 మంది విద్యార్థులకు ఒక టీచర్ మాత్రమే విద్యాబోధన చేస్తే, విద్యార్థులు ఎంతవరకు విద్యను అభ్యసిస్తారనేది ప్రజలు గమనించాలని, తాగడానికి నీరు లేక, మరుగుదొడ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న పాఠశాల భవనంలో, అంగన్వాడీ, గ్రామపంచాయతీ భవనంగా వాడుకోవడం, 15 రోజుల నుంచి అంగన్వాడీలో పప్పు సరఫరా లేక, పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో నాణ్యత లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ముందుకు వేసుకొని, కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వక, పనులు ముందుకు జరగక, పాఠశాలల్లో సమస్యలు పేరుకు పోతున్నాయని, ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ విద్యాలయాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెంద్యాల నర్సారెడ్డి, పోతుల భాస్కర్‌రెడ్డి, బండి ప్రవీణ్, బీపేట నరసింహులు, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా : రిటైర్డ్ పెన్షనర్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 4న నిజామాబాద్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఆర్. డీఓ కార్యాలయం (పాత డిటిఓ. ఆఫీసు) నిర్మలా హృదయ కాన్వెంట్ ఎదుట పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్టు అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, కార్యదర్శి అందే సాయిలు, కోశాధికారి రాధా కిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో నిజామాబాద్ డివిజన్లోని రిటైర్డ్ ఉద్యోగులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మొదటి తేదీనే పెన్షన్ చెల్లించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను పటిష్టపరిచి, నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనుమతించాలని, మార్కెటింగ్ శాఖ, ఎయిడెడ్ సంస్థలలో, లైబ్రరీలో పనిచేసిన పెన్షనర్లకు, హెల్త్ స్కీమును వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ డీఏలను విడుదల చేయాలని, పే రివిజన్ కమిటీని జులై 23 నుండి అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, రూ: 398తో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఈపీఎఫ్ పెన్షనర్లకు నెలకు రూ: 9వేలు పెన్షన్ చెల్లించాలని, తదితర ముఖ్య సమస్యలపై ధరా నిర్వహిస్తున్నట్టు తెలపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


ధర్నాలో మాట్లాడుతున్న అంజలి రఘురాం

విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై 21 రోజులు గడుస్తున్న ప్రభుత్వ స్కూళ్లలో, సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. నేటికి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించలేదని, మధ్యాహ్న భోజనం కొత్త మెనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్కడ అమలు కావడం లేదని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులకోసం యజమానులు పీడిస్తున్న విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని వెల్లుట్లపేట గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన శ్రీ రాజరాజేశ్వర ఆలయ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వల పాలనలో అభివృద్ధికి నోచుకోని గ్రామ ప్రజల కష్టాలు తీర్చిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఆనాడు అధికారంలో ఉన్న గత పాలకులు అటవీ గ్రామాల అభివృద్ధిని మర్చిపోయారని, కేవలం ఎన్నికల సమయంలోనే గ్రామాల్లో పర్యటించి ప్రజలను మద్యం పెట్టి ఓట్లుదండుకున్నారే కానీ అక్కడి ప్రజల అవసరాలు, ఆకలి తీర్చాలనే ఆలోచన చేయలేదన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామ శివారులో గల శ్రీ రాజరాజేశ్వర ఆలయానికి వెళ్లే దారిలోని ఈ బ్రిడ్జి కోసం నాలుగైదు గ్రామాల ప్రజలు అనేకసార్లు గత నాయకుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఎవ్వరూ పటించుకొలేదని, కానీ ఎమ్మెల్యే సురేందర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే బ్రిడ్జి కోసం రూ. 8లక్షల నిధులు మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.అర్ ఏఈ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సుతరి సాయిలు, పీఏసీయస్ చైర్మన్ పటేల్ సాయిలు, కోయ్యల విట్టల్ గౌడ్, కోరి ఏళ్ళప్ప, బొల్లు రాజులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కొయ్యాల రాజగౌడ్, గండ్ల సాయిరాం, తిమ్మారెడ్డి వసంతం, చిమ్మ గంగారాం పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శ

నవతెలంగాణ-ఏర్గట్ల


పలు కుటుంబాలన్ని పరామషించిన ముత్యాల సునీల్ రెడ్డి

తొర్తి గ్రామానికి చెందిన రాము వాళ్ళ అమ్మ సాయమ్మ, నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన గణేష్ గౌడ్ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందగా ఆయా కుటుంబాలను ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో మరణించిన గణేష్ గౌడ్ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట సునీల్ యువసేన సభ్యులు ఉన్నారు.

నేడు అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డిలో కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించేందుకు గానూ ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్ట్ కోసం మంగళవారం ఇంటర్వ్యూ, డెమో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వి.రాధిక సోమవారం తెలిపారు. అర్హత కల్గిన మహిళా అభ్యర్థులు కళాశాలకు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

పీవైఎల్ 8వ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-సిరికొండ

పి వై ఎల్ రాష్ట్ర 8వ మహాసభల పోస్టర్లను సిరికొండ మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిరికొండ మండల పివైఎల్ అధ్యక్ష కార్యదర్శులు బి సాయిలు, ఎం సంజీవ్ మాట్లాడుతూ.. ఈనెల 4 , 5 తేదీల్లో ఇల్లందులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మోడీ ప్రతిఏటా రెండు కోట్ల కొలువుల మాట, కెసిఆర్ ఇంటికో ఉద్యోగం హామీ నీళ్ల మూటగా మారిందని వారు ఎద్దేవాచేశారు. మహాసభల్లో భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించి, యువజన సమస్యలపై పివైఎల్ పోరాడుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పి వై ఎల్ మండల నాయకులు కే ప్రవీణ్, జాకీర్, లింబాద్రి, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ సెక్రెటరీ మార్క్స్, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు నిమ్మల భూమేష్ తదితరులు పాల్గొన్నారు.